ప్రజాశక్తి
గురువారం 1 ఫిబ్రవరి 2024
5
విజయనగరం

జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన పూలే, అంబేద్కర్, సేవారత్న జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అకాడమీ రాష్ట్ర మహిళా కార్యదర్శి డిపి మార్గరేట్ ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, గాయకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హులైన వారు 98481 63912, 94938 86967 నంబర్లను సంప్రదించాలని, నింపిన దరఖాస్తును జెఆర్‌నగర్, శ్రీకృష్ణ అపార్ట్‌మెంట్, విశాఖపట్నం అడ్రస్‌కు పంపించాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 11న తిరుపతిలో జరిగే జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేస్తామని చెప్పారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి కార్తీక్

బాధ్యతలు స్వీకరించిన జెసి కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కొల్లాబత్తుల కార్తీక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జెసిగా పనిచేసిన ఆయన, జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జెసి కార్తీక్‌కు వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై దృష్టి పెడతానని చెప్పారు. ముఖ్యంగా విజయనగరం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియోజకవర్గంపై దృష్టిసారిస్తానని, ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని అన్నారు. రెవెన్యూ అంశాలు, అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు, కౌలు రైతులకు రుణాలు, పంట కోత ప్రయోగాలు మొదలగు అంశాలతోపాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చి వేగవంతం చేస్తామన్నారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక తదితర శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. ఆయా శాఖల ప్రగతిపై జెసి చర్చించారు.

జాబ్‌మేళాకు భారీ స్పందన

- పాల్గొన్న 87 పారిశ్రామిక, వాణిజ్య, ఐటి, బ్యాంకింగ్ సంస్థలు
- వచ్చే రెండేళ్లలో జిల్లా యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు : కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- యువతకు నాణ్యమైన చదువులు, ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎమ్‌డి వినోద్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం

వచ్చే రెండేళ్లలో జిల్లాలో యువతకు కనీసం పది వేల నుంచి ఇరవై వేల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం 2026 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్టు ద్వారా సేవారంగంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. కొత్తవలస సమీపంలో త్వరలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో వస్తున్న జిందాల్ పారిశ్రామిక పార్కు ద్వారా కూడా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంతీయ జాబ్ మేళాను బుధవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎమ్‌డి వి.వినోద్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఆరు జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉన్న డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, హెటెరో వంటి 87 సంస్థలు ఇందులో పాల్గొంటున్నాయని చెప్పారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 9 స్కిల్ హబ్‌లు, ఒక స్కిల్ కళాశాల ద్వారా అవసరమైన వారందరికీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నియోజకవర్గ స్థాయిల్లో 14 జాబ్‌మేళాలు నిర్వహించి 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు.

జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఎమ్‌డి వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 600 నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలు నమోదయ్యాయన్నారు. ఒక్కో జిల్లాలో 20 కేంద్రాల వరకు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. యువత ఎపి స్కిల్ యూనివర్సల్ అప్లికేషన్ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా యువత ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ జాబ్‌మేళాకు 4 వేల మంది హాజరు అవుతారని, దీని ద్వారా కనీసం రెండు వేల మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయాలని భావిస్తున్నామని చెప్పారు. జాబ్‌మేళాకు వచ్చిన ప్రతి అభ్యర్థి ఉద్యోగంతో ఇంటికి వెళ్లాలని ఆశిస్తున్నట్టు సీతం కళాశాల కరస్పాండెంట్ మజ్జి శశిభూషణరావు అన్నారు. జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులందరికీ సీతం కళాశాల యాజమాన్యం సహకారంతో మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందించే ఏర్పాట్లు చేశారు. 87 సంస్థలకు నాలుగు అంతస్తుల్లో గదులు కేటాయించి అభ్యర్థుల ఇంటర్వ్యూలకు ఏర్పాట్లు చేశారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా.ఎన్.గోవిందరావు నేతృత్వంలో జిల్లా ఉపాధి అధికారి అరుణ తదితరులు జాబ్‌మేళాలో ఏర్పాట్లు చేశారు. ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి ఉమామహేశ్వరి, కళాశాల ప్రిన్సిపల్ రమణమూర్తి, ప్రాంతీయ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ రోహిణి, ఉత్తరాంధ్ర జిల్లాల నైపుణ్యాభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయలకు ఆర్థిక బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆ సంఘం రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. దీక్షలను ఉద్దేశించి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సి, ఎరియర్స్, డిఎ, ఎపిజిఎల్‌ఐ, పార్ట్‌పేమెంట్లు కలుపుకొని రూ.18 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్ర కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేయగా కేవలం రూ.1200 కోట్లు మాత్రమే విడుదల చేశారని, ఇంకా రూ.17వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. తాము దాచుకున్న డబ్బులను ఇవ్వడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. 4 లక్షల మంది ఉద్యోగులు డబ్బులు ఇవ్వకుండా తాత్సారం చేయడం అన్యాయమన్నారు. తామేమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో యుటిఎఫ్ నాయకులు జి.పార్వతి, సూర్యారావు, రాజారావు, శంకరరావు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

డిఎస్‌సి పోస్టుల సంఖ్యను పెంచాలి

డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి పోస్టుల సంఖ్యను పెంచాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ హరీష్, ఎన్.రుద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిఎస్‌సి ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ఊరిస్తూ కేవలం 6100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదని పేర్కొన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6100 పోస్టులు భర్తీ చేస్తామనడం నిరుద్యోగులను మోసం చేయడమేనని చెప్పారు. నాలుగేళ్లుగా 10 లక్షల మంది అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం డిఎస్‌సి పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు.

అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేయాలి

విజయనగరం టౌన్ : ఎన్నో పోరాటాలతో రద్దయిన అప్రెంటీస్ విధానాన్ని తిరిగి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్తా) జిల్లా అధ్యక్షులు చింతాడ రాము, ప్రధానకార్యదర్శి బి.నర్సింగరావు ఒక ప్రకటనలో వ్యతిరేకించారు. నాలుగేళ్లుగా మెగా డిఎస్‌సి ప్రకటిస్తారని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులపై నీరుచల్లినట్లుగా డిఎస్‌సి ప్రకటన ఉందని చెప్పారు. 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించి, 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామనడం నిరాశ కలిగించే విషయమని తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల్లా మిగతా ఉద్యోగాలకూ అప్రెంటిస్ విధానాన్ని ప్రకటిస్తారా? అని ప్రశ్నించారు.

ఆడుదాం ఆంధ్రా

జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక డిఎస్‌ఎ ఇండోర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుధవారం జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ప్రారంభించారు. తొలిరోజు బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, జిల్లాలో విజేతలుగా నిలిచి రాష్ట్ర పోటీల్లో రాణించి సత్తా చాటాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో డిఎస్‌డిఒ అచ్యుతరావు, సెట్విజ్ సిఇఒ రామ్‌గోపాల్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్‌వి రమణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారిణులు

చిట్టెంపాడులో ఐటిడిఎ పిఒ పర్యటన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం చిట్టెంపాడులో బుధవారం పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ పర్యటించారు. గ్రామంలోని గిరిజనుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు. పిఎం జన్‌మన్ కార్యక్రమం కింద సుమారు రూ.11 కోట్ల అంచనా వ్యయంతో 10.4 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి ప్రతిపాదన చేసినట్లు పిఒ తెలిపారు. విశాఖ కెజిహెచ్‌లో ఉన్న ఎస్‌టి సెల్ నుంచి తమకు పెద్దగా సహకారం ఉండటం లేదని, తమ జిల్లా నుంచి వైద్యం కోసం వెళ్లిన గిరిజనులకు వైద్య సహాయం అందడం లేదని గిరిజనులు వాపోయారు. దీనిపై పిఒ స్పందిస్తూ, ఇకనుంచి విజయనగరం జిల్లా గిరిజనులకు కూడా కెజిహెచ్ ఎస్‌టి సెల్ నుంచి తగిన సహకారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలను ఇప్పించాలని, ఆశా వర్కర్‌ను నియమించాలని, మినీ అంగన్ వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలని గిరిజనులు కోరారు. తమ ప్రాంతంలో జీడి పంట ఎక్కువగా సాగు అవుతుండటంతో జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పిఒ హామీ ఇచ్చారు. మండలంలోని గిరిజన గ్రామాలను ఐటిడిఎ పరిధిలో చేర్చాలని, గిరిశిఖర గ్రామాల్లో సెల్‌టవర్లు ఏర్పాటుచేయాలని, గర్భిణుల కోసం బొడ్డవరలో వసతిగృహం నిర్మించాలని గిరిజనులు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ పర్యటనలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి టి.చంద్రశేఖర్, ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శివకుమార్, ఎంపిడిఒ శేషుబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టెంపాడు గ్రామంలో పర్యటిస్తున్న పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

8న ఆశాల చలో విజయవాడ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్ల సమస్యలపై ఈ నెల 8న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సుధారాణి తెలిపారు. ఈ మేరకు ఆ రోజు విధులకు రాలేమని తెలుపుతూ డిఎంహెచ్‌ఒకు బుధవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్‌ని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పుచేయాలని కోరారు. వీటన్నింటిపై చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు మహాలక్ష్మి, త్రివేణి, రాధ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

సిఐల బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పలువురు సిఐలకు బదిలీ అయింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం విశాఖపట్నం రేంజ్ ఐజి ఉత్తర్వులు జారీ చేశారు. డిటిసిలో సిఐగా పనిచేస్తున్న ఎం.చంద్రశేఖర్ విఆర్‌కు, విఆర్‌లో ఉన్న ఎ.వి.లీలారావు విజయనగరం డిటిసి సిఐగా బదిలీ అయ్యారు. ముదిలి శ్రీనివాసరావు ఉద్యోగోన్నతిపై విజయనగరం రూరల్ సిఐగా రానున్నారు. భోగాపురం అప్‌గ్రేడెడ్ పోలీస్‌స్టేషన్ సిఐగా ఎ.రవికుమార్ బదిలీపై వస్తున్నారు.

ఎండిఎం కార్మికులకు రూ.10 వేలు వేతనమివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీని అమలు చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎంఇఒకు బుధవారం వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుత ధరలతో మెనూ అమలు చేయడం కష్టంగా ఉందని, పిల్లాడికి 20 రూపాయలు మెనూ ఛార్జీ పెంచాలని కోరారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరారు. నెలకు రూ.3 వేలతో ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ డిమాండ్లపై ఈ నెల 5న డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు రమాదేవి, అరుణ, రమా, అప్పలకొండ, గౌరీ, పుష్పలత, కామేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ వచ్చే వరకూ సవరణ

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చే వరకు చేర్పులకు, తొలగింపులకు అవకాశం ఉటుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. నామినేషన్లు పూర్తయ్యే వరకు ఓటర్ల నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం-7, 8లు స్వయంగా ఓటరు మాత్రమే దరఖాస్తు చేయాలని, వారి తరపున చేయడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా తుది ప్రచురణ అనంతరం కొన్ని పెండింగ్ అంశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ నాగలక్ష్మి ఎంపిక కావడం పట్ల సమావేశంలో రాజకీయ పక్షాల ప్రతినిధులు కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

సమావేశంలో జెసి కె.కార్తీక్, డిఆర్‌ఒ అనిత, ఇఆర్‌ఒలు వెంకటేశ్వరరావు, సుధారాణి, వైసిపి నుంచి రొంగలి పోతన్న, ఆప్ నుంచి దయానంద్, బిఎస్‌పి నుంచి సోములు, టిడిపి నుంచి కుటుంబరావు, బిజెపి నుంచి రాజేష్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

సచివాలయ సందర్శన

విజయనగరం రూరల్ మండల పరిధిలోని కొండకరకాం గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లోనే భూముల రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పట్టాలు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో వాటి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తెలుసుకొనేందుకు కలెక్టర్ గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, జిల్లా రిజిస్ట్రార్ ఎ.వి.కుమారి సహా అంతా హాజరై రిజిస్ట్రేషన్ల నిర్వహణలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను గుర్తించే ప్రయత్నం చేశారు. పలువురు లబ్ధిదారులను పిలిపించి వారి ఇ-కెవైసి నమోదు చేసి డాక్యుమెంట్ జనరేట్ చేసే ప్రయత్నం చేశారు.

రాష్ట్రంలో అసమర్ధ పాలన

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో అసమర్ధ పాలన సాగుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు అన్నారు. బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని 8, 28వ డివిజన్లలో రాజీవ్ నగర్‌కాలనీ, లంక వీధి, స్టేడియం కాలనీ, తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాపాడాలంటే టిడిపి - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వ అసమర్ధ పాలన పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని చెప్పారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెంచి, పన్నులు వేసి ప్రజలను అవస్థలకు గురిచేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పడం ఖాయమని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు

17 మంది తహశీల్దార్ల బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో 17 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ భూపరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 33 మంది తహశీల్దార్లకు గాను మూడేళ్ల సర్వీసు పూర్తయిన 17 మందిని బదిలీ చేశారు. జూన్ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న ఆరుగురిని, మూడేళ్ల సర్వీసు పూర్తికాని పది మందిని మినహాయించారు. 17 మందిని విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు బదిలీచేశారు. వారిని ఆయా జిల్లా కలెక్టర్లు మండలాలకు సర్దుబాటు చేయనున్నారు.

కుమారస్వామి సేవలు మరువలేనివి

ఉద్యోగ విరమణ సభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో కుమారస్వామి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో పంచాయతీరాజ్ డిఇ కుమారస్వామి ఉద్యోగ విరమణ సన్మాన సభ ఏర్పాటుచేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కుమారస్వామి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో వివిధ స్థాయిల్లో నిబద్ధతతో విధులు నిర్వహించారని తెలిపారు. తనకు అప్పజెప్పిన పనులను తూచ తప్పకుండా సమయానికి పూర్తిచేసి అందరి అదరాభిమానాలు చూరగొన్నారని కొనియాడారు. ఉద్యోగ విరమణ తరువాత కూడా తన శేషజీవితం సుఖసంతోషాలతో సాగాలని కోరారు. పంచాయతీరాజ్ ఎస్‌ఇ జి.ఎస్.ఆర్ గుప్త మాట్లాడుతూ తన శాఖలో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన ఉద్యోగి రిటైర్ అవుతుండడం చాలా బాధాకరమని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. తాను తీసుకున్న పనిని సమయానికి పూర్తిచేయడంలో ముందుండేవారని, ఎప్పుడు ఏ సమాచారం అడిగినా వెంటనే ఇచ్చేవారని గుర్తుచేశారు. కార్యనిర్వాహక ఇంజినీర్ కెజిజె నాయుడు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి, జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్ మాట్లాడుతూ కుమారస్వామితో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. అనంతరం కుమారస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ డిఇలు, ఎఇలు, ఉద్యోగులు, విశ్రాంత డిఇలు, ఎఇలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కుమారస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుమారస్వామి దంపతులను సత్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

'రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం'



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కోండ్రు

రేగిడి: రాజాంలోని పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలోని ఆత్మహత్యకు పాల్పడిన రేగిడి పంచాయతీరాజ్ ఇంచార్జి జెఇ వల్లూరి రామకృష్ణ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం సోమరాజుపేటలో రామకృష్ణ కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఓదార్చారు. అధికారులు, స్థానిక నాయకులు వేధింపులు తాళలేక ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నారని మృతుని భార్య మాజీ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇద్దరు పిల్లలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ వేధింపులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షుడు కిమిడి అశోక్ కుమార్, నాయకులు ఉషారాణి, ఉంగరాడ అంబకండి సర్పంచులు భుజంగరావు, లక్ష్మీ గోవింద్, దూబ ధర్మారావు, కర్నెన మహేష్, బూడి ఆదినారాయణ, పాలూరి రామినాయుడు, ధనుంజయ, గేదెల బాలమురళి, సుంకరి అప్పల నాయుడు, సుంకరి లక్ష్మణ నాయుడు, గురువాన నారాయణ రావు, రఘుమండల గణపతి, మాడుగుల జయరాం తదితరులున్నారు.

జెఎఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ కోరారు. బుధవారం నగర పంచాయతీ 4వ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు సత్వర ఆరోగ్య సేవలు అందించడానికి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, పట్టణ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగుల తయారీ కేంద్రం ప్రారంభం

బొబ్బిలి రూరల్: మహిళలకు ఉపాధి కల్పనే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బుధవారం బొబ్బిలి పురపాలక సంఘం 22వ వార్డు మల్లం పేటలో మెప్మా ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్లాత్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధికి ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, 22వ వార్డు కౌన్సిలర్, ఎఎంసి వైస్ చైర్మన్ తెంటు పార్వతి, 23వ వార్డు కౌన్సిలర్ కొర్లాపు రామారావు, మెప్మా అధ్యక్షులు తూముల రాణి, నాయకులు తెంటు శివాప్పలనాయుడు, పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని ఆరిగిపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి. జగదీశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో విద్యార్థుల వర్క్ బుక్స్, టెబుల్స్, ఇంగ్లీషు, తెలుగు రాయించి, చదివించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో సిఆర్‌పి రాంప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సదస్సుకు రైతులంతా కదలి రావాలి

కొత్తవలస: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అలైన్‌మెంట్‌లో రైతులకు నష్టం జరగకుండా మార్పులు చేయాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని కోరుతూ ఫిబ్రవరి 2 తేది తాటిపూడి వద్ద భూ నిర్వాసులతో సదస్సు నిర్వహిస్తున్నామని పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ తెలిపారు. ఈ సందర్భంగా జగన్ కొత్తవలసలో బుధవారం రైతులతో మాట్లాడుతూ ఇప్పటికే అలైన్‌మెంట్ మార్చాలని పలు దఫాలుగా పోరాట రూపాలు నిర్వహించామన్నారు. గ్రామ సభలో రైతులు తెలిపిన మెజార్టీ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకుడు జి అప్పారావు పాల్గొన్నారు.

బేబినాయనను విమర్శించే స్థాయి చైర్మన్‌కు లేదు

బొబ్బిలి: టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయనను విమర్శించే స్థాయి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణకు లేదని టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రంథాలయ భవన సమస్యపై జనసేన నిరాహారదీక్ష చేస్తే మద్దతు ఇచ్చిన బేబినాయనను మున్సిపల్ చైర్మన్ విమర్శించడం అన్యాయమన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పని చేసే బేబినాయనను విమర్శించే స్థాయి చైర్మన్‌కు లేదన్నారు.

బేబినాయన గెలుపు ఖాయం : తెంటు

రామభద్రపురం: బొబ్బిలి నియోజక వర్గం నుంచి బేబీ నాయన గెలుపు నల్లేరుపై నడకేనని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్ముంనాయుడు అభిప్రాయ పడ్డారు. బుధవారం బూసాయవలసలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా చంద్రబాబు నాయుడును సిఎం పీఠం మీద కూర్చో బెట్టడం అనివార్యమన్నారు. ఒక్క అవకాశంతో రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఆవేదన చెందారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, బటన్ నొక్కి డబ్బులు వేస్తున్నామని ఊదరు గొడుతున్నారే తప్పా అభివృద్ధిని గాలికి వొదిలేసారని విమర్శించారు. ఈ తరుణంలో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు భారీ మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు అభిమానులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

రసవత్తరంగా ఎడ్ల పరుగు పోటీలు

పోటీలో తలబడుతున్న ఎడ్ల బండి

వేపాడ: మండలంలోని వావిలపాడులో పరదేశమ్మ జాతర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన బుధవారం ఆకట్టుకుంది. ఈ పోటీలలో 16 బండ్లు పాల్గొని తలబడ్డాయి. విజేతలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపిపి డి సత్యవంతుడు, గ్రామ సర్పంచ్ బీల రాజేశ్వరి, వైసిపి నాయకులు బీల సతీష్ చేతులు మీదుగా నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో మేలు

వేపాడ: మండలంలోని వీలుపర్తి క్లస్టర్ పరిధిలోని వీలుపర్తిలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఉత్తమ ఎన్‌జిఒ బృందం బుధవారం పరిశీలించింది. విజయనగరం ప్రకృతి వ్యవసాయాధికారి డిపిఎమ్ ఆనంద్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ఆర్‌టిఎల్ ప్రకాశ్, ఆర్‌టిఒ హేమ సుందర్ బృంద సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై వివరించారు. ఇక్కడ ప్రకృతి వ్యవసాయంలో పాటిస్తున్న సార్వత్రిక సూత్రాలు, అపరాలలో ఆచరిస్తున్న వివిధ అంతర పంటలైన జనుము, బొబ్బర్లు, ఆకుకూరలు, రాగి, పిల్లి పెసర లాంటి పంటలను చూపించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస డివిజన్ ఎడిఎ ఎల్ విజయ, ఎంఎఒ యశ్వంత్ కుమార్, సర్పంచ్ సేనాపతి అప్పారావు, మాజీ సర్పంచ్ గోకాడ సత్యం నాయుడు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎంటిఎల్ వసంత, జాహ్నవి, సరోజినీ, ఎమ్‌టి సన్యాసమ్మ, రాము, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన జగన్ రెడ్డి

ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు గొంప కృష్ణ

శృంగవరపుకోట: ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి జగన్మోహన్ రెడ్డి యువతను మోసం చేశారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆరోపించారు. బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా 2వ రోజు తన కార్యాలయం నుంచి మండలంలోని శివరామరాజుపేట, కొత్తూరు, వెంకటరమణ పేట, తిమ్మిడి, వాసి, ఉసిరి, తలారి, వినాయకపల్లిలి గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినాయకపల్లి గ్రామంలో నిర్వచించిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి రైతులకు ఏమి చేయలేకపోయాడని గత టిడిపి హయాంలో చంద్రబాబు రైతులకు ఇన్సూరెన్స్, సబ్సిడీ ఎరువులు, ట్రాక్టర్ అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పలుచోట్ల ఆసరా సంబరాలు

ప్రజాశక్తి-గజపతినగరం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయ సమీపంలో చేపట్టిన వైయస్సార్ ఆసరా నాలుగో విడత నిధుల పంపిణీ సంబరాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైయస్సార్ ఆసరా, చేయూత తదితర పథకాలను మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి చెందాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తౌడు, ఎఎంసి చైర్మన్ వేమిలి ముత్యాలనాయుడు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి నారాయణ మూర్తి రాజు, ప్రభుత రాజు, నాయకులు మక్కువ శ్రీధర్, వైస్ ఎంపిపిలు కర్రి శ్రీదేవి, గద్ద దమయంతి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, మండల సురేష్, బెల్లాన త్రినాధరావు, కనకల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు



భోగాపురం: చెక్కును అందిస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆసరా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు మధ్య రానున్న ఎన్నికల్లో యుద్ధం జరగనుందన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ పథకాల ద్వారా మరింత అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. అనంతరం రూ.7.18 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, జెడ్‌పిటిసి పడాల మంజులత, సచివాలయ కన్వీనర్ పడాల శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, ఎం నరసింహులు, గ్రామ సర్పంచ్ అప్పయ్యమ్మ, యువజన నాయకులు సుందర హరీష్, నాయకులు పడాల భాను ప్రకాష్, ప్రతినిధి రామకృష్ణ, ఎంపిడిఓ అప్పలనాయుడు, తహశీల్దార్ బంగార్రాజు, ఏపిఎం ఆదిబాబు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : మాటపై నిలబడే నిజమైన నాయకుడు సిఎం జగన్మోహన్‌రెడ్డి మనమంతా అండగా నిలబడాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగోవిడత ఆసరా నిధులను జమచేసిన ముఖ్యమంత్రికి మహిళలంతా అండగా ఉండి గెలిపించాలని కోరారు. నాలుగో విడత ఆసరా సంబరాలను స్థానిక రాజీవ్ స్టేడియంలో బుధవారం ప్రారంభించారు. తనను మళ్లీ గెలిపిస్తే విజయనగరాన్ని సమస్యలు లేని పట్టణంగా రూపొందిస్తానని తెలిపారు. పెద్దచెరువును పూర్తిగా సుందరీకరణ చేస్తానని హామీ ఇచ్చారు. నాలుగో విడత కింద విజయనగరం పట్టణంలోని 37,406 సంఘాలకు చెందిన 33,368 మంది మహిళలకు రూ.25.8 కోట్లు, ల పరిధిలోని 794 సంఘాలకు చెందిన 8,413 మంది మహిళలకు రూ.5.15కోట్లను విడుదల చేశామని చెప్పారు. దీనికి సంబంధించిన చెక్కులను డిప్యూటీ స్పీకర్ చేతులమీదుగా మహిళలకు అందజేశారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చారని చెప్పారు. బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావులను ఈ సందర్భంగా సత్కరించారు. డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తిని దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. ఎంపిపి మామిడి అప్పల నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయా యాదవ్, ఎఎంసి ఛైర్‌పర్సన్ శశి భార్గవి, పొదుపు సంఘాల సభ్యులు గంటా శ్రావణి, గౌరి, మెప్మా పీడీ సుధాకరరావు, స్పెషల్ ఆఫీసర్ అరుణకుమారి, ఎంపిడిఒ గంటా వెంకటరావు, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ఎస్‌వివి రాజేష్, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాధ్, పార్టీ నాయకులు ఆశపు వేణు, జమ్ము శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మీ, వేణుగోపాల నాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, గొలగాన రమాదేవి, వైస్ ఎంపిపి అరసాడ శంకరరావు,

విజయనగరం సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

వైసిపి మండల అధ్యక్షులు చోడగంజి రమేష్ నాయుడు, ఉత్తరావల్లి అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్లు రేజేటి ఈశ్వరరావు, తమ్మిరెడ్డి దామోదర్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులతో మండలంలోని శాంభవి లేఔట్‌లో బుధవారం వైయస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగో విడతగా మండలంలోని 1056 గ్రూపులలో గల సుమారు 11,548 మంది మహిళలకు లబ్ధి చేకూరేలా రూ. 7.50 కోట్లు విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ క్రాంతి పదం ఏరియా కోఆర్డినేటర్ ఎన్ ఆదయ్య, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్), వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, జెసిఎస్ మండల కన్వీనర్ కుమార్, ఎపిఎం అప్పల నాయుడు, కోఆప్షన్ నెంబర్ షేక్ ఖాసిం, వివిధ పంచా యతీల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సచివాలయాలకు విద్యుత్తు కట్

- బిల్లులు చెల్లించకపోవడమే కారణం
- జూన్ నుంచి కట్టని వైనం

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రజల వద్దకు పాలన అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చినప్పటికీ వాటికి సంబంధించిన విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ కట్ చేశారు. మున్సిపాలిటీలో 16 సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అన్ని సచివాలయాలకు గతేడాది జూన్ నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో పాకీవీధి, సాయినగర్ సచివాలయాలకు బుధవారం విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ కట్ చేశారు. విద్యుత్ కట్ చేయడంతో ఆయా సచివాలయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప్రతినెల 16 సచివాల యాలకు నెలకు రూ.12వేలు వరకు విద్యుత్ బిల్లు వస్తుంది. జూన్ నుంచి జనవరి వరకు రూ.96వేలు వరకు విద్యుత్ బిల్లు బకాయి ఉంది. విద్యుత్ కట్ చేయడంతో సచివాలయ ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మిగిలిన సచివాల యాలకు కూడా విద్యుత్ కట్ చేస్తారని తెలుస్తుంది.



విద్యుత్తు లేక ఖాళీగా ఉన్న సచివాలయం

పంపుహౌస్, మున్సిపల్ కార్యాలయం బిల్లులూ బకాయి

మున్సిపాలిటీలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పంపు హౌస్, పట్టణ ప్రజలకు వెలుగు ఇచ్చే వీధి దీపాలు, మున్సిపల్ కార్యాలయం విద్యుత్ బిల్లులు కూడా గతేడాది జూన్ నుంచి చెల్లించలేదు. పంపు హౌస్‌కు నెలకు రూ.12లక్షలు, మున్సిపల్ కార్యాలయం, వీధి దీపాలు విద్యుత్ బిల్లు రూ.2.75లక్షలు వరకు బిల్లు వస్తుంది. పంపు హౌస్ విద్యుత్ బిల్లు బకాయి రూ.96లక్షలు వరకు, వీధి దీపాలు, మున్సిపల్ కార్యాలయం విద్యుత్ బిల్లు రూ.22లక్షలు వరకు బకాయి చెల్లించాల్సి ఉన్నా ప్రభుత్వం చెల్లించడం లేదు. అత్యవసర విభాగాలకు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై పలు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి విద్యుత్ బిల్లులు చెల్లించాలని ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

సిఎఫ్‌ఎంఎస్‌లో బిల్లులు పెండింగ్

విద్యుత్ బిల్లులు సిఎఫ్‌ఎంఎస్‌లో పెండింగు ఉన్నట్లు మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ చెప్పారు. విద్యుత్ బిల్లులు పెండింగులో ఉన్నప్పటికీ ప్రజా అవసరాలు తీర్చే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ కట్ చేయకూడదన్నారు. రెండు సచివాలయాలకు విద్యుత్ కట్ చేశారని, విద్యుత్ పునరుద్ధరణ చేయాలని విద్యుత్ శాఖాధికారులను కోరినట్లు చెప్పారు. ప్రభుత్వం బిల్లులు విడుదల చేసిన వెంటనే విద్యుత్ బిల్లులు జమ అవుతాయన్నారు.



నగదు అందిస్తున్న యువత

బాధితులకు వితరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడకు చెందిన కెవిడి ఎంప్లాయిస్, యువత ఇటీవల ఎల్‌కోటలో జరిగిన గ్యాస్ పేలుడులో గాయపడి చికిత్స పొందుతున్న యువతకు బుధవారం రూ.21వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన 2007 టెన్త్ బ్యాచ్ ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ గ్రూప్ తరపున యువత మరో రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కె వి డి ఎంప్లాయిస్‌ను, ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ గ్రూప్‌ను గ్రామస్థుల అభినందించారు.

బిసిలకు ప్రత్యేక చట్టం : టిడిపి

ప్రజాశక్తి - భోగాపురం

చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు ఒక చట్టాన్ని తీసుకురానున్నారని నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లి గ్రామంలో బుధవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలపై ఈ ప్రభుత్వం అనేక దాడులు చేసిందన్నారు. సైకో జగన్మోహన్ రెడ్డి తీరుతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే పేదల కోసం అనేక పథకాలను ప్రవేశపెడతారన్నారు. అందుకు రానున్న రోజుల్లో ఆయన్ని మనమంతా గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పలవెలమ కన్వీనర్ అళ్ళు విజయ్ కుమార్, పార్లమెంట్ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ నీలాపు అప్పలరామి రెడ్డి, క్లస్టర్ ఇంఛార్జి దాసరి అప్పలస్వామి, ఎంపిటిసిలు పిడుగు వెంకటసత్యం, బాబాజీ, నాయకులు సరగడ తోగులురెడ్డి, కోలా రామసూరి, కర్రోతు రాజు, కోరాడ తాతారావు, గరి వెంకటరమణ, గరికిన చిన్న రాములు, బడి నాయుడు, లింగాలవలస సర్పంచ్ బుగత రామ్మోహన్, రిసు రమణ, చింతపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని వీరనారాయణం గ్రామంలో జిల్లా పరిషత్ సాధారణ నిధులు రూ.9.80లక్షలతో చేపట్టబోయే సి.సి రోడ్డు నిర్మాణానికి, రూ.4లక్షలతో నిర్మించబోయే శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోషికుమారి, స్థానిక సర్పంచ్ ఎమ్.సరోజిని, ఎంపిటిసి బోజంకి వెంకటలక్ష్మి, మాజీ ఎంపిటిసి బోజంకి గోవింద, వైస్ సర్పంచ్ మెరపల పురుషోత్తమనాయుడు, రామస్వామిపేట సర్పంచ్ శర్మ, వార్డు మెంబర్లు విశ్వనాధం, నరసింహ నాయుడు, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ జగదీష్, సీనియర్ నాయకులు గొల్లు రాము నాయుడు, ఎమ్.శ్రీనివాస్, గంగరాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు: జెడ్‌పిటిసి

గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ పథకం అమలు ముఖ్య ఉద్దేశ్యమని జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో సుమారు రూ.10.70 లక్షలతో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి మంచినీటి కుళాయి కల్పన కార్యక్రమానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, స్థానిక మాజీ సర్పంచులు సొలుబొంగు కనకం, ముత్యాల సన్యాసిరావు, స్థానిక నాయకులు గడబంటి రాంబాబు, బుదరయ్య, వర్జి మహేష్, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - తెర్లాం

గ్రీన్ అంబాసిడర్లకు 14 నెలలుగా బకాయి ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. గంగన్నపాడు, అప్పలంపేట, నెమలము, సుందరాడ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 14 నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద బుధవారం గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు గ్రీన్ అంబాసిడర్లు నియమించిందని పంచాయతీకి వస్తున్న ఆదాయంలో, నిధుల్లోనూ గ్రీన్ అంబాసిడర్లుకు జీతాలు చెల్లించి తర్వాత పంచాయతీ అభివృద్ధికి ఖర్చు పెట్టాలని ప్రభుత్వాదేశాలు ఉన్నప్పటికీ అధికారులు ప్రజాప్రతినిధులు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. డిపిఒ, ఎంపిడిఒ అధికారుల వెంటనే చొరవ తీసుకొని బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని లేని పక్షంలో మండలమంతా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాగా కొంత మంది సర్పంచులు చులకనగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అనంతరం ఎంపిడిఒ రామకృష్ణకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఆర్ రామారావు, సిఐటియు మండల నాయకులు ఎస్ గోపాలు, కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు, శంకరరావు

ఎంపిడిఒలకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ విశాఖపట్నం బదిలీ అయిన సందర్భంగా ఆయన్ను మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ ఈ రెండు సంవత్సరాలు కాలంలో ఆయన అందించిన సేవలు గురించి కొనియాడారు. ఇఒపిఆర్‌డి ఉమా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం, తహశీల్దార్ కె. ప్రసన్నకుమార్, డిటి సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, గ్రామ సచివాలయ, ఉపాధి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: ఎంపిడిఒను సత్కరిస్తున్న ఎంపిపి, తదితరులు

డెంకాడ: ఇక్కడ ఎంపిడిఒగా పని చేసి బదిలీపై శ్రీకాకుళం వెళ్తున్న డిడి స్వరూపారాణిని మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు అనివార్యమన్నారు. ఇక్కడ ఎంపిడిఒ ఐదు సంవత్సరాలు పనిచేసి మంచి గుర్తింపును తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథం, కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, నాయకులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ప్రజాశక్తి - గుర్ల

ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చిత్త శుద్ధితో పనిచేయాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ శాఖ ప్రగతి నివేదికను ఎఒ తిరుపతి రావు వివరించారు. విద్యా, వైద్య, పంచాయతీ రాజ్, గృహనిర్మాణ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు నివేదికలను సభ్యులకు వివరించారు. ఒకరిద్దరు ప్రజా ప్రతినిధులు మినహా ఎవ్వరు గ్రామ సమస్యల పై మాట్లాడ లేదు. ఆరోగ్య శాఖ సిబ్బంది రాగోలు గ్రామానికి సక్రమంగా రావడం లేదని సర్పంచ్ కలిశెట్టి అప్పలరాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు సమస్య పై గుర్ల, గుజ్జంగివలస సర్పంచ్, ఎంపిటిసిలు తెలిపారు. అనంతరం బదిలీ పై శ్రీకాకుళం జిల్లా వెళుతున్న ఎంపిడిఒ బి.కల్యాణిని ఎంపిపి, అన్నిశాఖల అధికారులు దుశ్శాలువతో సన్మానించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సీర అప్పల నాయుడు, వైసిపి పలాస పరిశీలకులు కెవి సూర్యనారాయణ రాజు, డీఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వైస్ ఎంపిపిలు తోట తిరుపతి రావు, అంబళ్ల లక్ష్మీ, వైసిపి మండల అధ్యక్షులు జమ్ము స్వామి నాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల పరిస్థితి దయనీయం

ప్రజాశక్తి - జామి

దేశంలో ఎక్కడ ఏ గ్రామంలో పర్యటించి చూసినా వృద్ధుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని ప్రముఖ దర్శకుడు, రచయిత డాక్టర్ వేమలి త్రినాధరావు అన్నారు. తన తల్లి స్వర్గీయ వేమలి నారాయణమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా అట్టాడ బిఎస్‌ఆర్ ఆశ్రమంలోని వృద్ధులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు సమయానికి తిండిపెట్టే దాతల అవసరం పెరిగిందన్నారు. ప్రభుత్వాలు పింఛన్లు మంజూరు చేస్తే సరికాదని వారి ఆకలి తీర్చే మార్గాలు వెతకాలని చెప్పారు. జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుండి త్రినాధరావు ఒక్కరే నాటక రంగంలో డాక్టరేట్‌తో పాటు నంది అవార్డును సొంతం చేసుకున్నారని ప్రజలను చైతన్య పరిచే అనేక షార్ట్ ఫిల్మ్ త్రినాథ్ తయారు చేసారని కొనియాడారు. కార్యక్రమంలో వేమలి సూర్యారావు, శ్రీనివాసరావు, రామకృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అన్ని సబ్జెక్టులతో కూడిన స్టడీ మెటీరియల్‌ను సత్యసాయి ట్రస్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిపిఎ రాజు, కుమారస్వామి, ఎల్వీఎస్ నాయుడు, రామ్మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీలు..

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి కొత్తవలస పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చింతాడ వెంకట్ (నాని) రూ.4వేలు విలువ చేసే మూడు రీడింగ్ చైర్స్, ఐదు రీడింగ్ ప్లాంక్స్ వితరణగా అందించారని గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ బుధవారం తెలిపారు.

కుళాయి పనులు పూర్తి

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని నల్లబెల్లిలో రూ.9.6 లక్షలతో నిర్మిస్తున్న ఇంటింటి కుళాయి పనులు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి తెలిపారు. ఈ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఆమె వెంట గ్రామ పెద్ద చిరంజీవి, ఇన్‌స్పెక్టర్ కామేష్ తదితరులున్నారు.

మున్సిపల్ బడ్జెట్ ఏకగ్రీవంగా ఆమోదం

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ బడ్జెట్‌ను కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ప్రారంభ నిల్వ రూ.25.27కోట్లతో ప్రారంభించి రాబడి రూ.24.19కోట్లు, ఖర్చు రూ.23.03కోట్లు, అంతిమ నిల్వ రూ.26.43కోట్లతో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించి పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. టిడిపి వార్డులు పట్ల వివక్షత చూపుతున్నారని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు రాంబార్కి శరత్, వి.హైమావతి, సురేష్, కె.లక్ష్మీ అన్నారు. తమ వార్డులో రూ.4లక్షలతో అభివృద్ధి పనికి ప్రతిపాదనలు చేసినా ఎందుకు అజెండాలో పెట్టలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి ప్రశ్నించారు.

సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు